క్లుప్తంగా

అంకమ్మకు పూజలు



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ వారి పెద్ద తిరునాళ్ల నాలుగో రోజు బుధవారం గ్రామస్తుల బోనాలతో పాటు అంకమ్మ క్రతువులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం బయసీడు వారు పూల కప్పెర పట్టుకొని గ్రామంలో అమ్మవారి చరిత్రను ఒగ్గుకథ రూపంలో చెప్పారు. అర్ధరాత్రి తరువాత అంకమ్మ వారి ఆలయంలో దీవెనబండారు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. అంకమ్మ వారి ఆలయంలో ఏర్పాటు చేసిన జలబిందెల్లోని నీటిని నవధాన్యాలపై చల్లుతున్నారు. గురువారం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో పెద్ద తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ లీలాకుమార్ అన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

నందిగామ: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం స్థానిక జీడీఎంఎం కళాశాల ఆవరణలోని సీయోను ప్రార్థన మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఊర్ల మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బి.నవీన్ కుమార్, కోశాధికారిగా ఎం.రాజారావులను ఎన్నుకున్నారు. న్యాయ సలహాదారులుగా మట్టా ప్రసాద్, జీవీ ప్రసాదరావులను ఎన్నుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు నూతన అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు.

11న జాతీయ జాతీయ లోక్ అదాలత్

నందిగామ: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసుల సత్వర పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



నందిగామ: మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందని తహసీల్దార్ నరసింహారావు పేర్కొన్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటైన దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి ఆలయంలో మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే కూడలి తిరునాళ్ల ఏర్పాట్లపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు వచ్చే భక్తులకు తాగు నీటి సదుపాయం, పవిత్ర స్నానాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఛైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు



కంచికచర్ల: పరిటాల గ్రామంలో ఎర్ర జొన్న సాగు చేస్తున్న బొడేపాడి నరసింహారావు, బొడేపాడి వీరవసంతరావు పొలాలను ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారిణి ఎం.విజయభారతి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023 జరుపుకుంటున్న ప్రస్తుత తరుణంలో మన జిల్లాకు అనుకూలమైన జొన్న సాగు విస్తీర్ణం కంచికచర్ల మండలంలో 600 ఎకరాలు సాగులో ఉండటం సంతోషంగా వుందన్నారు. రైతులు బత్తుల శేషయ్య, వెంపరాల ఆంజనేయులు, కర్ల రామకృష్ణతో మాట్లాడారు. సంప్రదాయంగా సాగులో పచ్చ జొన్న, తెల్లజొన్న పంటలకు భిన్నంగా కొత్తగా సాగుకి పరిచయం చేసిన ఎర్రజొన్న పైరు వివరాలను తెలుసుకున్నారు. క్షేత్రపరిశీలనలో పంట ఆరోగ్యకరంగా ఉండటం, కంకులు కూడా పూర్తిస్థాయిలో తయారై దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. కాటుక తెగులు ఉధృతి కొంతమేర ఉండటంతో నమూనాలను సేకరించి శాస్త్రవేత్తలకు తెలియపరుస్తామన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 ప్రణాళిక అనుగుణంగా రైతులు సాగు చేసిన జొన్న పంటకు రైతులు కనీస మద్దతు ధర పొందే విధంగా కొనుగోలు కేంద్రాన్ని పరిటాల గ్రామంలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలుపంపే విషయమై రైతులతో చర్చించినట్టు తెలిపారు. జొన్న పంటకు నిత్యం డిమాండ్ ఉంటుందని, ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులతో పంట నమోదు (ఈ–క్రాప్) చేపించుకోవాలని తెలిపారు. నందిగామ వ్యవసాయ సహాయకులు ధర్మపురి రమణమూర్తి, ఏవో విజయకుమార్, వ్యవసాయ సహాయకులు రఘుకుమార్, చంద్రశేఖర్, పొరుగు గ్రామాల సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

100 పడకల ఆస్పత్రికి మంత్రివర్గ ఆమోదం

- కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు నిర్ణయం
- త్వరలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- మంత్రి మండలి ఆమోదం అభినందనీయం
- ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్
- టపాసులు కాల్చి సందడి చేసిన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: నియోజకవర్గానికి 100 పడకల ఆస్పత్రి, కేంద్రీయ విద్యాలయం మంజూరు చేసి అభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి గాంధీ సెంటరు వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నందిగామలో 100 పడకల ఆస్పత్రి మంజూరుకు మంత్రి మండలిలో ఆమోదం, ఉద్యోగుల నియామకాలకు అనుమతించటం హర్షణీయమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మంత్రి మండలి నిర్ణయం ప్రకటించటంతో ఈ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారని అరుణకుమార్ తెలిపారు. ఆస్పత్రితో పాటు కేంద్రీయ విద్యాలయ భవనాలకు కూడా త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమంలో మెడికల్ కళాశాలపై స్పష్టత తీసుకువచ్చేలా ప్రకటన చేయించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అనితర కృషి చేస్తున్నారని కొనియాడారు. వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మారుస్తూ క్యాబినేట్ ఆమోదం తెలపటం అభినందనీయమని అరుణకుమార్ పేర్కొన్నారు. గత ప్రభుత్వాల ప్రజా ప్రతినిధుల మాదిరిగా మాటలు చెప్పేవారం కాదని చేసి చూపించే వారమని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి సందడి చేశారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, పాములపాటి రమేష్, కందుల నాగేశ్వరరావు, నల్లమల్లి మురళి, దాసు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, వీసం దుర్గారావు, బండారు వెంకట్రావ్, విశ్వనాధపల్లి కృష్ణారావు, షేక్ ఫాతిమ, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం

- ఆర్డీవో రవీంద్రబాబు
- మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రబాబు

ముక్త్యాల(జగ్గయ్యపేట): భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీవో రవీంద్రబాబు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా ముక్తేశ్వర స్వామి కల్యాణానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు జల్లు స్నానాలు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఇటీవల పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం వద్ద జరిగిన అగ్ని ప్రమాదం దృష్ట్యా అగ్నిమాపక సిబ్బంది ఉత్సవాలలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నదిలో భక్తులు దిగకుండా ప్రత్యేకంగా పడవలు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. గత ఉత్సవాల సందర్భంగా చేసిన ఏర్పాట్లకు భిన్నంగా ఈ ఏడాది ఉత్సవాలను కూడా విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం అన్ని శాఖల నుంచి ఉత్సవాల ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్, పుష్కర ఘాట్‌లను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, ఉత్సవ కమిటీ అధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు, ఈవో నాగరాజు, ఎంపీడీవో కార్యాల సూపరింటెండెంట్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావు, కార్యదర్శి నరసింహారావు, కేసీపీ, అల్ట్రాటెక్, కోహైన్స్ కెమికల్ ల్యాబ్ ప్రతినిధులు ప్రసాద్, నారాయణ, సతీష్, గ్రామ పెద్దలు షాఉద్దీన్, దాది బ్రహ్మం, వెంకట నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం అభినందనీయం

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



రవి, కృష్ణవేణిలను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ఎస్సీ వర్గానికి చెందిన మహిళకు విజయవాడ ఇంద్రకీలాద్రి దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యునిగా అవకాశం కల్పించడం ద్వారా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదర్శవంతమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. ఓసీ సామాజిక వర్గానికి వ్యక్తికి కూడా ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించి సామాజిక న్యాయం పాటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పాన్ని నెరవేర్చారని తెలిపారు. విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన పట్టణానికి చెందిన నంబూరి రవి, ఆళ్లూరి కృష్ణవేణి దంపతులను పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు వారిని దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయభానుకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, ఏఎంసీ డైరెక్టర్ పింగళి నర్సింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, పూసాల పుల్లారావు, కాటగాని నరసింహారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంగా జుజ్జూరు

- మంత్రివర్గం ఆమోదంపై ప్రజల హర్షం
- సీఎం జగన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు



మండల కేంద్రంగా మారిన జుజ్జూరులో గ్రామ సచివాలయం

వీరులపాడు: వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మారుస్తూ రాష్ట్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలపటంతో చిరకాల వాంఛ నెరవేరిందని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి పాలకులు జుజ్జూరును మండల కేంద్రంగా ప్రకటించినప్పటికీ వీరులపాడును మండల కేంద్రంగా కొనసాగించారు. వీరులపాడు తెలంగాణ రాష్ట్రానికి అతి చేరువలో ఉంటుంది. మండల ప్రజలు ఆయా పనులపై మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే..

2019 ఎన్నికలకు ముందు అప్పటి వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు మండలంలో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వీరులపాడుకు రాకపోకలు సాగించేందుకు పడుతున్న అవస్థలను ప్రజలు ఆయనకు వివరించారు. దీంతో మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్చటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

22 గ్రామ పంచాయతీలు..

వీరులపాడు మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో 15 గ్రామ సచివాలయాలుండగా 49,089 మంది జనాభా ఉన్నారు. వీరిలో పురుషులు 24,420 మంది ఉండగా మహిళలు 24,669 మంది ఉన్నారు. జుజ్జూరు మేజర్ గ్రామ పంచాయతీగా మేజర్ గ్రామాలకు మధ్యన ఉంటుంది. కంచికచర్ల–మధిర రహదారి మధ్య ఉంది. మేజర్ గ్రామ పంచాయతీగా కొనసాగుతున్న జుజ్జూరులో 7,226 మంది జనాభా ఉండగా పురుషులు 3578 మంది, మహిళలు 3658 మంది ఉన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు..

వీరులపాడు నుంచి మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్చుతూ మంత్రివర్గం ఆమోదం తెలపటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అందుకు సహకరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కాగా జుజ్జూరు గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. పార్టీలకతీతంగా ప్రజలు టపాసులు కాల్చుతూ ఆనందాన్ని పంచుకున్నారు.

విధుల బహిష్కరణ

నందిగామ: డోన్‌లో సీనియర్ న్యాయవాది పులి దామోదర్‌పై జరిగిన దాడికి నిరసనగా బుధవారం నందిగామలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెగంటి జీవరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని న్యూహోప్ పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఉచిత కంటి, దంత వైద్య శిబిరం బుధవారం ముగిసింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నట్లు న్యూహోప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ప్రభుదాసు పేర్కొన్నారు. దాదాపు 500 మందికి పైగా కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వైద్యులు పాల్గొన్నారు.

12న ఉచిత వైద్య శిబిరం

కంచికచర్ల: ఈ నెల 12న పరిటాల పాత గ్రామ పంచాయతి భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంజె.నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంతశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాలు, నేత్ర, బీపీ, షుగర్ సమస్యలను వైద్య నిపుణులు పరిశీలిస్తారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేస్తారని ఆయన ప్రకటనలో తెలియజేశారు. పరిటాల గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

నందిగామ: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండలంలోని మునగచర్ల గ్రామ సమీపంలో బోస్ డ్రైవింగ్ స్కూల్‌లో బుధవారం ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయవలసిన ప్రథమ చికిత్స అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి పారేపల్లి సత్యనారాయణ అధ్యక్షతన పలువురు ఐక్యవేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో బుధవారం వాసవీక్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఓ నిరుపేద మహిళకు నెలకు సరిపోయే విధంగా రూ. 4 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. స్థానిక లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు వితరణతో ఈ సరుకులను అందజేశారు. వాసవీక్లబ్ కపుల్స్ ప్రతినిధులు పేరూరి నరసింహారావు, కొత్తా కృష్ణారావు, కర్లపాటి కొండ, రాయపూడి శ్రీకాంత్, కొత్తా రమేష్‌కుమార్, మద్దుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవర్మరణం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణానికి చెందిన వివాహిత దంతాల లక్ష్మీదుర్గ (30) ఆత్మహత్యకు పాల్పడింది. సేకరించిన వివరాల ప్రకారం.. స్థానిక ఆకులవారి వీధిలో నివాసం ఉంటున్న లక్ష్మీదుర్గ భర్త కుమార్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఆమె ఉరి వేసుకుంది. చుట్టుపక్కల వారు మృతురాలి తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి తలుపులు తీసి చూడగా మృతి చెందింది. మృతిరాలి తల్లి అత్తులూరి అన్నపూర్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ బీవీ రామారావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పెట్రోల్ బంకుల ఆకస్మిక తనిఖీ



పెట్రోల్ బంక్ తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి కుమారి తదితరులు

పెనుగంచిప్రోలు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గ్రామంలోని మూడు పెట్రోల్ బంక్‌లు, కొణకంచి క్రాస్‌రోడ్స్‌లోని మరో పెట్రోల్‌బంక్‌ను లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బి.కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయిల్‌ను చెక్‌చేయటంతో పాటు బంక్‌ల్లో ఉచితంగా అందించే గాలి, టాయిలెట్స్ ఉన్నాయా, లేదా అని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనిఖీలో పరిశీలన చేసిన విషయాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, పీడీఎస్ డీటీ రామ్మూర్తిరెడ్డి, ఆర్ఐ డి.జనార్ధనరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైభవంగా పునః ప్రతిష్ఠా మహోత్సవం

హోమాది పూజల్లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు దంపతులు



ప్రతిష్ఠా మహోత్సవ హోమాది క్రతువుల్లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు దంపతులు

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురం గ్రామంలో దాసాంజనేయ స్వామి ఆలయ నవీకరణ, స్వామి వారి విగ్రహ, జీవధ్వజ, ద్వారపాలక పునః ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా బుధవారం విశ్వక్షేణారాధన, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, అగ్ని మదనం, క్షీరాధివాసంలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి విశేషార్చన, నవ కుంభారోహణ, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, మహాలక్ష్మీ హోమం, జలాధివాసం కార్యక్రమాలను ఆర్చకులు అంగర రాంబాబు, హరినవీన్, మణికుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ మహోత్సవాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దంపతులు..

దాసాంజనేయ స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మహోత్సవాల కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించండి

జిల్లా వ్యవసాయాధికారి విజయభారతి



ఈ-క్రాప్ రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

వీరులపాడు: రైతులు పండిస్తున్న పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి విజయభారతి పేర్కొన్నారు. మండలంలోని పొన్నవరం, వీరులపాడు గ్రామాలలో జరిగిన ఈ–క్రాప్ నమోదు తీరును బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం నమోదు చేసిన పంటల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మండలంలోని చట్టన్నవరం, చౌటపల్లి, నరసింహారావుపాలెం, వెల్లంకి గ్రామాల్లో వ్యవసాయ శాఖ బృంధాలు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు

వత్సవాయి: వేసవిలో తాగునీటి ఎద్దడిలేకుండా చూడాలని మండల పరిషత్ అధ్యక్షుడు చెంబేటి వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా మండలస్థాయి అధికారులు తమశాఖల పనితీరు సభ్యులకు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా మండలంలో 66 పనులను గుర్తించామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. వత్సవాయిలో రూ.3 కోట్ల 26 లక్షల 40 వేలతో 2 లక్షల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌తోపాటు సంప్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. లింగాల మునేటి నుంచి 5 వేల మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేయడంతోపాటు 40 సంవత్సరాల కాలపరిమితి ఉండేలా డీపీ పైపులద్వారా లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీవో గ్లోరీ మాట్లాడుతూ 700 మంది గర్భిణులు, బాలింతలు, 2500 మంది చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. 38 కేంద్రాలు అద్దెభవనాల్లో నడుస్తున్నాయన్నారు. ఎంఈవో ఎల్.నాగరాజు మాట్లాడుతూ మండలంలో 8వ తరగతి చదువుతున్న 464 మంది విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందాయన్నారు. హౌసింగ్ ఏఈ చిదంబరేశ్వరరావు మాట్లాడుతూ ఉగాది రోజున సామూహిక గృహప్రవేశాలు చేస్తున్నట్లు చెప్పారు. ఏపీవో రాఘవ మాట్లాడుతూ మండలంలో 16 వేల జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. 2008లో జాబ్‌కార్డు తీసుకుని నేటివరకు పని చేయనివారిని గుర్తించి జాబ్‌కార్డులు రద్దుచేస్తామన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులుగా అవార్డు అందుకున్న ఎంఈవో నాగరాజు, హౌసింగ్ ఏఈ చిదంబరేశ్వరరాలను సభ్యులు సన్మానించారు. ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, ఉపాధ్యక్షురాలు కాటేపల్లి రవి రామతులసి, సర్పంచులు భూక్యా సీతమ్మ, లేళ్ల హరికృష్ణారెడ్డి, బాణావతు శ్రీను, ఎంపీటీసీలు హుస్సేనీ, రత్నకుమారి, హౌసింగ్ ఏఈ సుందరరామయ్య, వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సాగు మేలు



మాట్లాడుతున్న సుబ్బారావు

గరికపాడు(జగ్గయ్యపేట): సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేస్తే మంచి ఫలితాలుంటాయని, రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని గుంటూరు లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకుడు సుబ్బారావు పేర్కొన్నారు. గ్రామంలోని కేవీకేలో 2023–24కు సంబంధించి ఖరీఫ్‌లో పంటలపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలను విరివిగా చేయించాలన్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాల ప్రకారం పంటలను సాగు చేసుకోవాలన్నారు. కేవీకేలో సాగు చేసే పంటలను రైతులు పరిశీలించి ఆ విధంగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. అందుకు కేవీకే శాస్త్రవేత్తలు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య, శాస్త్రవేత్తలు మాధవీలత, ముకుందరావు, నందకిషోర్, భాస్కరరావు, భవానీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: ప్రజల నుంచి పారిశుద్ధ్య సమస్యపై ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. బుధవారం పలు వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు మున్సిపాలిటీ వారికి సహకరించాలని కోరారు. ఇళ్లలో వ్యర్థ పదార్థాలను కాలువల్లో, ఖాళీ స్థలాల్లో పడవేయకుండా చెత్త సేకరించే వాహనాల్లో పడవేయాలని సూచించారు. ఖాళీ స్థలాల యజమానులు ఎప్పటికప్పుడు తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానాలు విధించాల్సి వస్తుందన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతి రోజు విధిగా హాజరు కావాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.